www.prajasakti.com

# ప్రజాశక్తి

బుధవారం 8 జనవరి 2025

5

తూర్పుగోదావరి



## ఎస్‌సి కులగణనపై 12 వరకూ అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎస్‌సి కులగణన పై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12 వరకు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎస్‌సి సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఎస్.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాల స్వీకరణ మంగళవారంతో ముగిసింది. దీంతో మరో ఐదు రోజులు పొడిగిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. పెండింగ్ గడువులోగా అభ్యంతరాలను అధికారులకు అందించాలన్నారు. అధికారులు స్వీకరించిన వివరాలను జనవరి 16 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20న గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు.

# ప్రభుత్వ విద్యారంగ రక్షణే ధ్యేయం


- యుటిఎఫ్ ప్రతినిధుల సభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్
- 3వ రోజు సాగిన ప్రతినిధుల సభ
- నేడు నూతన కమిటీ ఎన్నిక, పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ విద్యా రంగం రక్షణే ధ్యేయంగా కదలాలని, దీని కోసం అందరూ నడుం బిగించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పిలుపునిచ్చారు. కాకినాడ పిఆర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలో మంగళవారం మూడోరోజు కొనసాగింది. ఇందులో భాగంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభను నిర్వహించారు. ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. భవిష్యత్తు కర్తవ్యాల గురించి వివరించారు. దేశంలో, రాష్ట్రంలో విద్యారంగం ప్రపంచ బ్యాంకు కనుసన్నల్లో నడుస్తూ, శరవేగంగా కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ జరుగుతుందన్నారు. ఫలితంగా పేదలకు విద్య దూరమయ్యే ప్రమాద పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యారంగాన్ని కాపాడుకునే ప్రతి ఉపాధ్యాయుడు నడుం కట్టాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 24 వేల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సింగిల్ టీచర్ పాఠశాలలుగా మారబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటులో చట్టం చేయకుండా కేంద్రం తెచ్చిపెట్టిన నూతన విద్యా చట్టం-2020 విద్యా వ్యాపారానికి అనువుగా మారిందన్నారు. ప్రభుత్వ బడులను, ఉద్యోగ ఉపాధ్యాయులను పరిరక్షించుకోవడానికి భవిష్యత్తు ఉద్యమాలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. 16వ మహాసభల్లో రాష్ట్ర యుటిఎఫ్ సభ్యత్వం 80 వేలు ఉండగా 17వ మహాసభలకు లక్ష పైనే దాటిందని తెలిపారు. యుటిఎఫ్ పట్ల ఉపాధ్యాయులకు ఉండే నిబద్ధతకు ఇది ప్రతీక అన్నారు.



గ్రూపు చర్చల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు



మహాసభలో సౌహార్ద సందేశం ఇస్తున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి



ఎంవిఎస్.శర్మ



వి.బాలసుబ్రహ్మణ్యం




కెఎస్ఎస్.ప్రసాద్

ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు చైతన్యవంతమై సమాజానికి దిశ నిర్దేశకులు కావాలన్నారు. సోషల్ మీడియాకు బానిసలు కారాదన్నారు. దేశంలో పలు రకాల శక్తులు తమ పన్నాగాలను పబ్బం గడుపుకోవడానికి రకరకాల కార్యక్రమాలతో ప్రజల మధ్య విద్వేషాలు పెంచి వారి ఆలోచనలు పక్కదోవకు పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. దీన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. దేశ సమగ్రత లౌకిక తత్వం కాపాడుకోవడానికి సాయుశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయులు సమైక్యంగా ఉండాలన్నారు. పిల్లలను సాంకేతిక దృక్పథంవైపు నడిపించాలన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి సంఘం ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఐక్య ఉపాధ్యాయ పత్రిక నివేదికను ఎన్.కుమార్‌రాజా, ఆడిట్ కమిటీ నివేదికను రాష్ట్ర కమిటీ అధ్యక్షులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు, ప్రచురణల కమిటీ నివేదికను అధ్యక్షులు ఎం.హనుమంతరావు, మహిళా కమిటీ నివేదికను ఎఎస్.కుసుమకుమారి, రాష్ట్ర యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం నివేదికను ఎస్‌పి.మనోహర్ కుమార్ ప్రవేశపెట్టారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత ఇటీవల మరణించిన పలువురు ప్రముఖులకు సభ్యులు నివాళులర్పించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లోనూ, యుటిఎఫ్ అకాడమిక్ అంశాల్లోనూ ప్రతిభ చూపిన వారికి జ్ఞాపికలను అందించారు. సభలో పాల్గొన్న ముఖ్య అతిథులకు జ్ఞాపికలు అందించారు. అనంతరం జిల్లాల వారీగా సమీక్ష జరిగింది. సాయంత్రం యుటిఎఫ్ సాంస్కృతిక దళం ఆలపించిన విప్లవ గీతాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఎఎస్.కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శులు ఎన్.అరుణకుమారి, వి.శ్రీలక్ష్మి, బి.సుభాషిణి, ఎస్.కిషోర్ కుమార్, రెడ్డి మోహన్‌రావు, టి.అన్నారావు, ఎస్.జ్యోతిబసు, కాకినాడ జిల్లా యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరేష్, పి.చక్రవర్తి, యుటిఎఫ్ కృషి రాష్ట్ర పత్రిక బాధ్యులు ఐ.ప్రసాదరావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### గురువులతోనే సమాజంలో మార్పు : కలెక్టర్

సమాజంలో ఏదైనా మార్పు రావాలంటే అది గురువుల ద్వారా మాత్రమే సాధ్యమని కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభకు మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సౌహార్ద సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులంతా కూడా సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తన తల్లిదండ్రులు కూడా కడప జిల్లాలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. గురువులు తమ వృత్తి ద్వారా గౌరవాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు యుటిఎఫ్ తరుపున ఆయనకు జ్ఞాపికను ఇచ్చి సత్కరించారు. తరువాత యుటిఎఫ్ సంక్షేమ పథకం బ్రాండ్‌ను ప్రారంభించారు.



నివాళులర్పిస్తున్న సిపిఎం కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తదితరులు

# సిపిఎం నేత రాఘవమ్మ ఇకలేరు...

## పలువురి నాయకుల సంతాపం

ప్రజాశక్తి-అమలాపురం, అయినవిల్లి



సిపిఎం నాయకురాలు కుడిపూడి రాఘవమ్మ (72) ఇకలేరు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడిలో కన్ను మూశారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన తొత్తరమూడిలో బుధవారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. రాఘవమ్మ మృతికి సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాఘవమ్మ మరణం ఉద్యమాలకు తీరని లోటన్నారు. వ్యవసాయ కూలీ పోరాటాలు, మద్యపాన వ్యతిరేక పోరాటాల్లో రాఘవమ్మ క్రియా శీలకంగా పనిచేశారని కొనియాడారు. పార్టీ, ప్రజా సంఘాల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ కార్మిక సంఘం అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షురాలిగా, రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారని తెలిపారు. అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన రాఘవమ్మకు భర్త ఒక కుమారుడు ఇద్దరు కుమార్తెలు. భర్త కుడుపూడి నరసింహమూర్తి వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. ఆయన గతంలోనే మరణించారు. ఆయన సిపిఎంలో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన ప్రోత్సాహంతో రాఘవమ్మ ప్రజా ఉద్యమాల్లో కి వచ్చారు. భర్త మరణం అనంతరం కూడా ఆమె పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 1990లో కోనసీమలో ఉవ్వెత్తున జరిగిన కూలీ పోరాటాలు, భూస్వామ్య వ్యతిక పోరాటాల్లో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. వెంకటాయపాలెంలో శిరోముండనం ఘటనలో ఆమె ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. రాఘవమ్మ మృతికి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల బారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి.బలరాం, అంద్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చల్లా రవికుమార్, డివి.రాఘవులు, ఎన్.బలరాం, జి.దుర్గాప్రసాద్, కె.కృష్ణవేణి, టి.నాగవరలక్ష్మి, డి.లక్ష్మి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటి కార్యదర్శి సఖిలే సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు తాడి శ్రీరామ్మూర్తి, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పీతల రామచంద్రరావు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.సురేంద్ర, ఎంటివి.సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.శంకర్ కో కన్వీనర్ కె.ప్రణీత్, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.ఎస్తేరురాణి, కార్యదర్శి మలకా సుభాషిణి, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, కోశాధికారి పి.అమూల్య తదితరులు సంతాపం తెలిపారు.

## రీ సర్వేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

భూముల రీ సర్వేను జయప్రదం చేయాలిన తహశీల్దార్ శ్రీనివాస్ కోరారు..రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లో భూముల రీసర్వే ప్రక్రియను ప్రారంభించదన్నారు. ఇందులో భాగంగా మిర్తిపాడులో జనవరి 20 నుంచి భూముల రీసర్వేను ప్రారంభిస్తున్నామని తెలిపారు. మిర్తిపాడు గ్రామంలో రైతులందరూ వారి భూములకు సంబంధించిన వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ జిరాక్స్ కాపీలు, రైతు ఫోన్ నెంబర్, చనిపోయిన భూ యజమానుల వారసులు వారి పేరుపై భూములను మార్చుకునేందుకు, ఇతరుల వద్ద భూమిని కొనుగోలు చేస్తే పేరు మార్పు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రీసర్వే నిర్వహించే తేదీ, సమయం నోటీస్ ద్వారా తెలియజేస్తామన్నారు. రైతు సమక్షంలో సర్వేయర్లు సర్వే చేస్తారన్నారు. దీనికి సహకరించాలని రైతులను కోరారు.

## ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం

మండలంలో రెవెన్యూ గ్రామ సదస్సులు మంగళవారంతో ముగిశాయి. ఉండ్రాజవరం సచివాలయం వద్ద తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుల్లో పలువురు రైతులు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులు మండలంలోని మొత్తం అన్ని గ్రామాలలో పూర్తయినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెండే వెంకటరావు, టిడిపి మండల అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

# నిరంతర అభ్యసనతో ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

నిరంతర అభ్యసన, కృషితో ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు అన్నారు. పిడింగొయ్యి ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఆవరణలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో వార్షిక పరీక్షల నిర్వహణాపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు రివిజన్ టెస్టుల్లో సహకారం అందించాలన్నారు. తద్వారా జిల్లా ఉత్తీర్ణతా శాతం పెరుగుదలకు కృషి చేయాలన్నారు. 10వ తరగతి తో పాటుగా మిగిలిన తరగతుల వార్షిక పరీక్షల నిర్వహణా,



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి శిక్షణ ప్రణాళిక, సామగ్రి అందించామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ఉప విద్యాశాఖాధికారులు పాత్ర కీలకం అన్నారు. పాఠశాలలను భోధన తీరును వారు పర్యవేక్షించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 25,723 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలను రాయనున్నారని తెలిపారు. పదో తరగతి విద్యార్థులను విభజించి పున్నశ్చరణ తరగతులు నిర్వహిస్తూ వార్షిక పరీక్షల తరహాలో ఎ, బి గ్రేడుల వారికి 25 మార్కులకు, సి, డి గ్రేడుల వారికి 20 మార్కులకు పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డిఇఒలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## దశల వారీగా పార్కుల అభివృద్ధి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలో పార్కులను దశల వారీగా అభివృద్ధి చేస్తామని రాజమహేంద్రవరం కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. లాలాచెరువు స్పిన్నింగ్ కాలనీలో జాతీయ రహదారిని ఆనుకొని 1.07 ఎకరాల్లో రూ.2 కోట్లతో నిర్మించిన పిల్లల పార్కును ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లాలా చెరువు పంచాయతీ నగరపాలక సంస్థలో విలీనం అయిన తరువాత పలు సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆ క్రమంలో హౌసింగ్ బోర్డు కాలనీలో అంబేద్కర్ పార్కు, స్కేటింగ్, బ్యాడ్‌మింటన్ కోర్టు, జిమ్ ఎక్విప్ మెంట్‌తో అభివృద్ధి చేశామన్నారు. పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదం కలిగించేలా ఈ పార్కును అభివృద్ధి చేశామన్నారు. ఇందులో వాటర్ ఫౌంటెన్, పిల్లల ఆట వస్తువులు, కత్తులతో నిర్మించిన సింహాసనం లాంటి కుర్చీ, టన్నెల్ వంటి ఆకర్షణలు ఏర్పాటు చేశామన్నారు. పిల్లల కోసం సైకిల్ ట్రాక్, లాలిపప్, గొడుగు, గ్లోబ్ తదితర ఏర్పాట్లు ఉన్నాయన్నారు. నగరంలో పార్కులన్నింటిలో ఇప్పటికే ఓపెన్ జిమ్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేశామన్నారు. లే ఔట్లలోని ఖాళీ స్థలాల్లో పార్కులు అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి : సిఐ నాగేశ్వర్‌నాయక్

ప్రజాశక్తి - గోపాలపురం

యువత క్రీడలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని దేవరపల్లి సిఐ బి.నాగేశ్వర్‌నాయక్ అన్నారు. వేళ్లచింతలగూడెంలో సంక్రాంతి సంబరాల్లో బాగంగా ఘంటా రంగారావు, మధుకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను మంగళవారం ప్రారంభించారు. పశ్చిమగోదావరి, శ్రీకాకుళం జిల్లాల మధ్య పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడాకారులతో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈనెల 15వ తేదీ వరకూ జరిగే క్రికెట్ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.1.50 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.30వేలుగా నిర్వాహకులు ప్రకటించారు. వాలీబాల్ పోటీలు ఈనెల 9వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. 8 నేషనల్ వైడ్ మహిళల టీంలు, 8 పురుషుల టీంలు పాల్గొంటాయన్నారు. వీరిలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ50వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు. తృతీయ బహుమతి రూ.30వేలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. విజేతలకు ఘంటా మధుకృష్ణ బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కొర్లపాటి రాము, పిన్నమనేని వెంకటరత్నం, వెలగా శ్రీరామమూర్తి, జ్యేష్ట శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సిఐ నాగేశ్వర్‌నాయక్



బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డిఇఒ వాసుదేవరావు తదితరులు

## గోదావరి బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఫిబ్రవరి 23, 24 తేదీల్లో జరగబోయే గోదావరి బాలోత్సవం 3వ పిల్లలపండుగ బ్రోచర్‌ను జిల్లా విద్యా శాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.తులసి పత్రికలకు ఒక ప్రకటనను విడుదల చేశారు. గోదావరి బాలోత్సవం ఫిబ్రవరి 23, 24 తేదీల్లో స్థానిక ఎస్‌కెవిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతుందన్నారు. రెండ్రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమంలో పోటీల వివరాలు, షెడ్యూల్, టైమ్ టేబుల్, రిజిస్ట్రేషన్ ఫామ్స్‌తో కూడిన బ్రోచర్‌ను అన్ని ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలలకు అందిస్తామన్నారు. ఆయా పాఠశాలల నుంచి పాల్గొనే విద్యార్థుల వివరాలతో రిజిస్ట్రేషన్ ఫామ్స్‌ను ఫిబ్రవరి 10లోపు మెయిల్ లేదా, స్వయంగా తమ కార్యాలయానికి వచ్చి అందించొచ్చన్నారు. 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఇందులో పాల్గొనొచ్చన్నారు. దరఖాస్తులను అన్ని పాఠశాలలకు అందిస్తామన్నారు. ఎవరికైనా అందని పక్షంలో 9347199131 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ బ్రోచర్ ఆవిష్కరణలో ఎఎంఒ గౌరీశంకర్, సిఎంఒ శ్రీనివాస్, డిసిబి సెక్రటరీ అనిత, డిఐ దిలీప్‌కుమార్, కడియం ఎంఇఒ మణికుమార్, దేవరపల్లి ఎంఇఒ తిరుమలదాస్, గోదావరి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి దాసరి సాయిబాబా, కార్యదర్శి ఇజ్జన వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## 'కిశోరి వికాసం'తో బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి - గోపాలపురం

కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని ఆరోగ్యకరమైన సాధికారత దిశగా బాలికల బంగారు భవిష్యత్తుకు సమిష్టి కషితో చేద్దామని అధికారులు అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం సమావేశపు హాల్లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ బిఎస్ఎస్.శ్రీనివాస్, తహశీల్దార్ కె.అజయ్‌బాబు, ఎంఇఒ జి.శ్రీనివాసరావు, సిడిపిఒ కె.నాగలక్ష్మి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమం 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల బాలికల సమస్యలను పరిష్కరించడానికి ఉద్దేశించిందన్నారు. వారి ఆరోగ్యం, పోషణ, విద్యను మెరుగు పర్చేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఒ పద్మావతి,ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## భౌతిక శాస్త్ర విభాగంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


నగరంలోని ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగంలో మంగళవారం అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లి గూడెం ఎకెఎన్‌యు పిజి సెంటర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎఫ్రైన్ బాబు ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లోని ప్రాథమిక కణాల ఆవిర్భావం, వాటి లక్షణాలు, పదార్థాల్లో వాటి ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి సిహెచ్.కోమలలక్ష్మి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రబీలో 10,200 ఎకరాల్లో వరి సాగు

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో రబీ సీజన్‌లో 10,200 ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని మండలం వ్యవసాయాధికారి ఎస్‌కె.ఇమామ్ ఖాసిమ్ తెలిపారు. నరేంద్రపురం, నందరాడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాగడుతూ పంట వేసి 15 నుంచి 20 రోజుల్లో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి పి.ధర్మ, ఎస్‌కె.దిల్‌షాద్‌బి తదితరులు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




# లక్ష్య సాధనకు ప్రణాళికతో పని చేయాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం ప్రణాళికలు రూపొందించుకొని పని చేయాలని జాతీయ ఉపాధి హామీ పథకం కమిషనర్ సూచించారని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ సూచనలు చేశారన్నారు. ఈనెల 15న ప్రారంభించి జూన్ 15లోగా లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు రూ.300 జీతం అందుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ సంబంధిత పనులను, మంచినీటి చెరువులను గుర్తించాలని, నీటి సాంద్రత పెంచేలా చర్యలు తీసుకొని, ఆయా గ్రామ ప్రజలకు, పశువులకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. పారంపాండులలో చెరువులు తవ్వించి, ఆ నీరు పశువులకు, పొలాలకు మందు పిచికారీ చేసేందుకు ఉపయోగించుకోవాలన్నారు. అమృత్ సరోవర్ చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ లు, ఎవెన్యూ ప్లాంటేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వివివిఎస్.రామారావు, మండల టెక్నికల్ అసిస్టెంట్ జి.కాంతారావు, కంప్యూటర్ ఆపరేటర్, మండల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు

## ముత్యాలమ్మ జాతరకు భారీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని కె.సావరం గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ నార్ని రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ జాతర మహెూత్సవంలో భాగంగా తొలి రోజు నూతన స్వర్ణ కిరీటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ముత్యాలమ్మకు అలంకరిస్తామన్నారు. జాతరను పురస్కరించుకుని గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించామన్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయన వెంట కె.సావరం, టి వేమవరం, జంగం చెరువు ముత్యాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు కాకర్ల నాని, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కాకర్ల పాండు, బసవ రమణారావు, వర్రె రమేష్, మీసాల సురేష్, బొల్లాడ దొరబాబు నార్ని నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దశల వారీగా రహదారుల అభివృద్ధి

ప్రజాశక్తి - సీతానగరం

దశల వారీగా రహదారులను అభివృద్ధి చేస్తామని రాజానగరం ఎంఎల్‌ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. ఇప్పటికే కొన్ని రహదారుల నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. సంక్రాంతిలోపు రోడ్లు అభివృద్ధే లక్ష్యంగా పనులు చేపట్టినట్టు తెలిపారు. రూ.2.04 కోట్లతో గాదరాడ, కనుపూరు, నందరాడ తదితర గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. నియోజకవర్గంలో రహదారులకు మహర్దశ ప్రారంభమైందన్నారు. ఆయా ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి రోడ్ల నిర్మాణంతో పాటు కొన్ని రోడ్లకు గుంతలు లేకుండా మరమ్మతులు చేయిస్తామన్నారు.

# నేరాలు ఘోరాలు

## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఒక వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొబ్బర్లంకకు చెందిన జెట్టం జ్యోతిర్మయికి మూడేళ్ల క్రితం వివాహం అయ్యింది. ఏడాది తరువాత వారు విడిపోయి విడాకులు తీసుకున్నారు. బొబ్బర్లంకలో ఉంటూ ధవళేశ్వరంలో కుట్టు మిషన్ నేర్చుకోవడానికి వెళుతోంది. ఈ నెల 5న ఉదయం ధవలేశ్వరం వెళ్లి తిరిగి రాలేదు. దీంతో జ్యోతిర్మయి సోదరుడు సతీష్ కుమార్ పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్ల వద్ద వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం పోలీసులు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

## పేకాడుతున్న 9 మంది అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల పరిధిలో పలు పేకాట శిబిరాలపై రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేశారు. ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, పేకాట, గుండాటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వివాహేతర సంబంధమే హత్యకు కారణం

ప్రజాశక్తి-కె.గంగవరం

కె.గంగవరం మండలం కూళ్లలో సోమవారం రాత్రి జరిగిన యువకుని హత్య కేసు వివరాలను ఎస్ఐ జానీ బాషా వెల్లడించారు. గ్రామానికి చెందిన సత్తి సువర్ణరత్నం, మంచాల వెంకట సూర్యారావు స్నేహితులని, సువర్ణ రత్నంకు తన భార్యతో వివాహేతర సంబంధం ఉందని సూర్యారావు అనుమానించాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రత్నంను మందు పార్టీ చేసుకుందామని పిలిచాడు. అధిక మొత్తంలో మద్యం సేవించడంతో అతడు స్పృహ కోల్పోయాడు. సూర్యారావు బీరు బాటిల్ పగలగొట్టి రత్నం గొంతు వద్ద గాయం చేశాడు. అయినా ప్రాణం ఉందని గమనించి పక్కనే ఉన్న కాలువలో పడుకోబెట్టి మట్టిలో కూరుకుపోయేలా తొక్కడంతో రత్నం మృతి చెందాడు. మృతుని అన్న సత్తి ఆనంద్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కె.గంగవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..కొత్తపల్లి గ్రామానికి చెందిన అడపా సూరిబాబు ఉప్పాడ - పిఠాపురం ప్రధాన రహదారి సమీపంలో ఉన్న తన ఇంటి వద్ద ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా మరో ద్విచక్రవాహనదారుడు వేగంగా ఢీకొట్టాడు. దీంతో సూరిబాబు తలకు తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు కొత్తపల్లి పిహెచ్సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రుడిని కాకినాడకు తరలించారు.


ప్రమాదంలో పగిలిపోయిన మద్యం కేసులు

## మద్యం వాహనానికి ప్రమాదం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట-పిఠాపురం రోడ్డులో మద్యంతో వెళ్తున్న వాహనాన్ని మరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మద్యం కేసులు పగిలిపోయాయి. డ్రైవర్కు గాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం సామర్లకోట ఐఎంఎల్ డిపో నుంచి మద్యం కేసులతో డి.పోలవరం వెళుతున్న వాహనాన్ని పిఠాపురం వైపు నుంచి వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో మద్యం కేసులు పెద్ద ఎత్తున పగిలిపోయాయి. వాహన డ్రైవర్కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాక సిబ్బంది

## పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రామయ్యపాలెం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదం జరిగింది. రామయ్యపాలెం గ్రామానికి చెందిన గొల్లవిల్లి బాబురావుకు చెందిన పొగాకు బేరన్లో అగ్ని ప్రమాదానికి గురియింది. బేరన్లో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే పొగాకు ఉందని రైతు తెలిపారు. పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంటలను ఆర్పేందుకు కూలీలు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటీనా అగ్నిమాపక యంత్రాంగం వచ్చి మంటలను అదుపు చేసిన ఫలితం లేకుండా పోయింది. అప్పటికే పొగాకుతోపాటు, బేరన్ కూడా పూర్తిగా కాలిపోయిందని రైతు బాబూరావు కన్నీరుమున్నీరు అయ్యారు.

## తలపై యంత్రం పడి రైతు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు మొక్కజొన్నలు ఆడే మిషను తలపనై పడటంతో రైతు మతి చెందాడు. ఈ ఘటనం గోపవరంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కె.సతీష్కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన పోత్ర లక్ష్మణరావు(42) మొక్క జొన్నలు ఆడే మెషిన్ను తన భుజంపై పెట్టుకుని తీసుకెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. దీంతో భుజంపై ఉన్న మిషన్ తల పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతని భార్య పోత్రా మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

# యానాం వార్తలు


సమావేశంలో మాట్లాడుతున్న రీజెన్సీ చైర్మన్ నాయుడు

## ప్రజలు సహకరిస్తే పరిశ్రమ పునరుద్ధరణ

### రీజెన్సీ వ్యవస్థాపక చైర్మన్ నాయుడు

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రజలు సహకరిస్తే రీజెన్సీ సిరామిక్ పరిశ్రమ పునరుద్ధరణ సాధ్యపడుతుందని రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జిఎన్.నాయుడు అన్నారు. మంగళవారం రీజెన్సీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ప్రజలతో సుమారు నాలుగు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. రీజెన్సీ అంటే యానాం, యానాం అంటే రీజెన్సీ అనేంతగా ప్రజలతో మమేకం అయ్యామన్నారు. రీజెన్సీ తిరిగి ప్రారంభమైతే వేలాది కుటుంబాలకు అన్నివిధాలా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. యానాంకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు ఇప్పటికీ తపన పడుతున్నానని, అయితే ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. రీజెన్సీ ముందుకు వెళ్లకుండా అడ్డుపడుతున్న వారిపై చర్యలను ఖండించాలన్నారు. రీజెన్సీ కోసం ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని ముఖ్యమంత్రి రంగసామి స్వయంగా భరోసా ఇచ్చారని అన్నారు. సిఎం హామీతో కోట్లాది రూపాయలను పెట్టుబడి పరిశ్రమలో ఉత్పత్తికి సన్నహాలు చేశామని తెలిపారు. రీజెన్సీ పరంగా ప్రభుత్వానికి ఒక్క పైసా కూడా బకాయి లేమన్నారు. రీజెన్సీ టైల్స్ ఉత్పత్తి కోసం సహజ వాయువు సరఫరా కోసం కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నామని, దీని కోసం సిఎం రంగసామి ప్రభుత్వపరంగా కేంద్రానికి నివేదిక పంపారని వివరించారు. కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొచ్చేందుకు అందరూ సహకరించాలని అన్నారు. రీజెన్సీ రాకతో యానాం వచ్చే రోజుల్లో అన్ని రంగాల్లో మరింత ప్రగతిబాట పట్టగలదని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్ రెడ్డి పారిశ్రామికాభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నారని, వారిబాటలో పుదుచ్చేరి ప్రభుత్వం పయనించేలా నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రజా ఉత్సవాల్లో రీజెన్సీ సంస్థపై మల్లాడి కృష్ణారావు చేసిన అభియోగాల అర్థరహితమని అన్నారు. సహజవాయువు సరఫరా అంశం ఒక కొలిక్కి వస్తే రీజెన్సీ పున్నరుద్ధరణకు మార్గం సుమగం కాగలదని, సానుకూల దృక్పథంతో అందరూ రీజెన్సీకి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - యానాం

వెంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను రీజెన్సీ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జిఎన్.నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరును ఆలయ అర్చకులు ఆయనకు వివరించారు. పిల్లారాయ, సుబ్రహ్మణ్య స్వామి, ఆంజనేయ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ అశోక్

## రైతులకు చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలువురు రైతులకు చెక్కులు, మిల్క్ మిషన్లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక పశువుల ఆసుపత్రి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తగిన కృషి చేస్తానని అన్నారు. యానాంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డైరెక్టర్ డాక్టర్ లతామంగేష్కర్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.కౌమరన్, గీదా పండు, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


బాల భవన్ చిన్నారుల నృత్య ప్రదర్శన

## అబ్బుర పరిచిన చిన్నారుల నృత్యప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

ప్రజా ఉత్సవాలల్లో బాలభవన్ చిన్నారుల నృత్యప్రదర్శన అబ్బురపరిచింది. మంగళవారం రాత్రి జరిగిన నృత్యప్రదర్శనలు చేసిన వారిలో కరక జ్యోతిక నాగలక్ష్మిదుర్గ, బత్తుల రాఘహర్షిత, దూలిపూడి లక్ష్మి లిఖిత, సబ్బతి వెన్నెల, తిక్కిరెడ్డి విజయలక్ష్మి, ఆకుల హిమబిందు, పెన్నాడ అలేఖ్య, పెన్నాడ దేవిహర్షిత, ఆలువల్లు విన్మయశ్రీ, దంగేటి షహర్ష, మట్ట శశి కావ్యశ్రీ, గుర్రం గోదా నాగశ్రీ మనస్విని, కనకాల ప్రభ మనోజ్ఞ, అజ్మీరా ధిత్యశ్రీ, దాసరి మణి చందన, గెడ్డల జాన్వీ సాయిశ్రీ, సంగాని వాను ప్రియ, సోమేశ్వరపు ఈక్షిత సేవల్లి, పువ్వల వెన్నెల, అరదాడి కాశ్వి ఉన్నారు.


స్వాగతం పలుకుతున్న పరిపాలనాధికారి మునిస్వామి, మల్లాడి

## యానాం చేరుకున్న పుదుచ్చేరి గవర్నర్

ప్రజాశక్తి - యానాం

యానాంలో బుధవారం ముగిసే ప్రజా ఉత్సవాలు, ఫల పుష్ప ప్రదర్శనలో పాల్గొనేందుకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్ నాథన్ మంగళవారం రాత్రి యానాం చేరుకున్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద ఆయనకు పరిపాలనాధికారి మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కండవల్లి రామకృష్ణ, ఎస్పి రాజశేఖరన్ పాల్గొన్నారు.

# రంగోత్సవ్లో కడియం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- కడియం

బొమ్మూరులో జరిగిన రంగోత్సవ్ 2024 - 25 జిల్లా స్థాయి పోటీల్లో కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు బహుమతులు సాధించారని హెచ్ఎం టి.సత్యనారాయణ తెలిపారు. బొమ్మూరు డిఐఇటి ప్రిన్సిపల్ జయశ్రీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమము జరిగింది. డిజిటల్ కంప్యూటర్స్ కేటగిరిలో వై.యోగిసత్యప్రియాంక మొదటి ప్రైజ్ సాధించగా, రంగోలిలో ఎస్.ప్రియదర్శిని, ఎస్.కుసుమశ్రీలక్ష్మి అనుష్క, రూప సత్యశ్రీ ద్వితీయ బహుమతి సాధించారు. ఫోక్ డ్యాన్స్లో కె.స్నేహఅక్షయ ద్వితీయ స్థానం స్లొగన్స్లో ఎం.వీరదుర్గానందిని ద్వితీయ స్థానం, డ్రాయింగ్లో వి.హేమశృతి ద్వితీయ స్థానం, క్విజ్లో శశికళ ద్వితీయ స్థానం, హ్యాండ్ రైటింగ్లో టి.శివనాగతేజశ్రీ ద్వితీయ స్థానం సాధించారన్నారు. ఉపాధ్యాయురాలు బి.సువర్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులను పోటీలకు పంపినట్లు ఆయన తెలిపారు. విజేతలను అభినందించారు.



బహుమతులు పొందిన కడియం విద్యార్థులు

# పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లాలో మూడు రోజుల అధికార పర్యటనలో భాగంగా విచ్చేసిన పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్నాథన్కు కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పి డి.నరసింహకిషోర్ స్వాగతం పలికారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ఆయన మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందించి వారు స్వాగతం పలికారు. వారి వెంట ఎయిర్ పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర్, ఆర్డిఒలు ఆర్.కృష్ణనాయక్ ఉన్నారు. అక్కడ నుంచి ఆయన నేరుగా కొవ్వూరు వెళ్లారు. బుధవారం ఉదయం యానానికి పయనమవుతారు. యానాం ప్రజా ఉత్సవాల్లో పాల్గొంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. గురువారం యానాం నుంచి బయలుదేరి ఉదయం 9.45 కి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి హైదరాబాద్కు పయనమవుతారు.


గవర్నర్కు పుష్ప గుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రశాంతి

# కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై అధ్యయనం

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలోని కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనపై అధ్యయనం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు రాయితీలతో పరిశ్రమల స్థాపన కోసం అవకాశాలు కల్పిస్తున్నాయని ఆ స్థాయిలో కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. ఆ దిశగా కమిటీ సభ్యులు చైతన్యాన్ని తీసుకు వచ్చి ప్రోత్సహించాలని సూచించారు. కొబ్బరి ముడిసరుకు ఆధారంగా వర్జిన్ కోకోనట్, కొబ్బరి వాటర్ ద్వారా పౌడర్ తయారీ, కోకో పిట్ తయారీ వంటి విలువ ఆధారిత రంగాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని సూచించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం (పిఎంఇజిపిఎస్) ఉపాధికి ఊతం, ఉన్నతికి మార్గమన్నారు. స్వయం ఉపాధితో పాటు మరో పదిమందికి ఉపాధి చూపేం దుకు, జీవితంలో ఉన్నతికి ఈ పథకం ఉపయోగ పడుతుందని, యువత ఆసక్తికి అనుగుణంగా స్వయం ఉపాధి మార్గాలను చూపడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పికెపి.ప్రసాద్, సహాయ సంచాలకుడు శివరామ్ప్రసాద్, ఉద్యాన అధికారి బివి.రమణ, డిఆర్డిఎ పీడీ శివ శంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్కుమార్

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకండి : మంత్రి సుభాష్

ప్రజాశక్తి-రామచంద్రపురం

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ సభ్యత్వాలు 55 వేలు, పట్టణంలో 11 వేలకు పైగా నమోదు చేసి లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందన్నారు. కార్యకర్తలంతా ఐక్యంగా ఉండి, పార్టీ కార్యక్రమాలు ముందుకు తీసుకెళ్లాలని, కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. స్థానికంగా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మంత్రి సుభాష్ తండ్రి సత్యం మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుర్తిస్తామని, ఎవరూ నిరాశ చెందనవసరం లేదన్నారు. పార్టీ సభ్యత్వాలు నమోదు లోనూ, నీటి సంఘాల ఎన్నికల్లో సమిష్టిగా కషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.




# ఇసుక ర్యాంపులో జట్టు కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపు వద్ద మంగళవారంఉపాధి కల్పించాలంటూ జట్టు కార్మికులు నిరసన తెలిపారు. జట్టు కార్మికుల సంఘ నాయకులు బొక్కా శ్రీనివాస్, పలివెల వెంకట్రావు, రాగం శ్రీనివాస్, మాగాపు నారాయుడు, పీతల రమణ, సంగాని శ్రీనివాస్, బెల్లపు శేఖర్, డొక్కా శ్రీనివాస్, కర్రి బాలరాజు, తెలికోటి రాజు మాట్లాడారు. ప్రభుత్వం జట్టు కార్మికులతో ఇసుక ఎగుమతికి అనుమతిం చిందని, ఇటీవల లారీలతో రాత్రి వేళల్లో ఇసుక తరలించేస్తున్నారని తెలిపారు. దీంతో ర్యాంప్ బాట పాడై ట్రాక్టర్లు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. దీనిపై ఇసుక తోలకం ఆపినప్పటికీ తమను లెక్క చేయకపోవడంతో రాంపును నిలిపివేసి ఆందోళన చేపట్టామన్నారు. ర్యాంపులో తమకు ఉపాధి కల్పిస్తామని ఉదయం రమ్మన్నారని, ఒక గంట తర్వాత స్టాక్ నిండిపోయింది. మీకు పని లేదని చెప్పారని వాపోయారు. దీంతో ర్యాంపు నిర్వాహకులు జట్టు కార్మికులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో ర్యాంపు నిర్వహణ యథావిధిగా సాగింది. ఈ కార్యక్రమంలో జట్టు కార్మికులు బెల్లపు శేఖర్, జట్టు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న జట్టు కార్మికులు

## మంత్రి ఆదేశాలతో స్తంభాల తొలగింపు

ప్రజాశక్తి - పెరవలి

మండల పరిధిలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఐదేళ్ల క్రితం సర్వీస్ రోడ్డు నిర్మించారు. రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్తంభాలను తొలగించ కపోవడంతో ప్రయాణాలకు ఆటంకంగా మారాయి. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ విషయాన్ని కూటమి నాయకులు మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి నేషనల్ హైవే అధికారులతో మాట్లాడి స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు మంత్రి ఆదేశాల మేరకు సోమవారం వీటిని తొలగించారు.



## ఇందిరమ్మ కాలనీ చెంత మంటలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు ఇందిరమ్మ కాలనీ సమీపంలో ఉన్న మీననగరం క్వారీలో చెత్తకు నిప్పంటించడంతో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. మంటలకు తోడు భారీగా పొగ కమ్మేయడంతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇందిరమ్మ కాలనీ వాసుడు భరత్ మాట్లాడుతూ ఇంద్రమ్మ కాలనీలో సుమారు మూడు వేలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. ఈ ప్రాంతంలో చెత్తను డంప్ చేస్తున్నారన్నారు. అంతేకాక దానికి నిప్పంటించడంతో పొగతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మంగళవారం భారీగా ఎగసిపడిన మంటలను చూసి ప్రజలు భయాందోళనతో బయటకు పరుగులు తీశారన్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు దొంగ రామకష్ణ, బాబి, మల్లి బాబు, ఆకుల మున్న తదితరులు సందర్శించారు

## పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేయాలి

**తాళ్లపూడి :** ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అన్ని రంగాల్లోనూ నిర్లక్ష్యానికి గురవుతున్న పాత్రికేయుల సంక్షేమం కోసం ఆలోచన చేయాలని పలు పార్టీల నాయకులు అన్నారు. తాళ్లపూడిలోని రావి పార్టీ కళ్యాణ మండపంలో తాళ్లపూడి మండల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఏ తలారి వెంకట్రావు, యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, వైసిపి సీనియర్ నాయకులు కె.కేశవనారాయణ తదితరులు పాల్గొని మాట్లాడారు. తాళ్లపూడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్ను అతిథులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, జీవి ప్రసాద్, సింహాద్రి జనార్ధన్ రావు, నామన పరమేశ్వరరావు, ఇండుగుల రామకష్ణ, కాకర్ల వెంకటేశ్వరరావు, తహశీల్దార్ రవీంద్రనాథ్, ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్డి ఆర్.వీరన్న, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

## కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - పెరవలి

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ డి.అచ్యుత కుమారి హెచ్చరించారు. గుండాట, పేకాట తదితర జూదాలకు దూరంగా ఉండాలన్నారు. వీటి నిర్వహణకు స్థలం ఇచ్చి వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ సిహెచ్.వెంకటరమణ, ఎఎస్ఐ టి.ప్రసాదరావు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వేధింపుల ఘటనలో ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా గతేడాది డిసెంబర్ 31న రాజంపేటలో ముగ్గులు వేసుకుంటున్న మహిళలను వేధించి, ఘర్షణకు దారితీసిన కేసులో సోమవారం ఐదుగురిని సీతానగరం పోలీసులు అరెస్టు చేశారు. సీతానగరం ఎస్ఐ రామ్కుమార్ మాట్లాడుతూ జనవరి 2న నిందితుడు దుర్గాప్రసాద్ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. సోమవారం ఈ కేసులో మరో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. మునికూడలికి చెందిన కప్పల జయసూర్య, మురాల అనిల్దేవా, రాచపల్లి నారాయణమూర్తి, మార్పు ప్రేమ్కుమార్, జాలిమూడి గ్రామానికి చెందిన కర్రి చందులను అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ కేసులో మరో తొమ్మిది మందిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. త్వరలో వారినీ అరెస్టు చేస్తామని తెలిపారు.

## నేడు విద్యుత్ సఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని 33/11 కెవి మల్లవరం సబ్ స్టేషన్ ఆర్డిఎస్ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నామని మండల విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని మల్లవరం, గౌరిపల్లి, చంద్రవరం, మార్కొండపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు. అగ్రికల్చరల్ ఫీడర్కి ఉదయం 4 గంటల నుంచి 8 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

## నేడు కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు కిశోరి వికాసం కార్యక్రమంపై బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఒక రోజు శిక్షణ నిర్వహించనున్నట్టు ఎంపిడిఒ వివివిఎస్.రామారావు మంగళవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిక్షణా తరగతులకు ప్రాజెక్ట్ అధికారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పెరవలి, మండల విద్యాశాఖ అధికారి, ఎపిఎం, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిక చేసిన సిబ్బంది హాజరవుతారన్నారు.